www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 03 | ఏప్రిల్ | 2026
పేజీలు : 8

# తునికాకు వేళాయె..!



- నత్తనడకన ప్రూనింగ్ పనులు
- పూర్తయిన టెండర్లు
- వేసవి పంట కోసం ఎదురు చూపు
- నానాటికీ తగ్గిపోతున్న తునికాకు

2లో..




# దారి మారుతున్న ప్రభుత్వ విద్య..!

- ఎత్తివేత దిశగా పల్లెబడులు
- విద్యాశాఖలో పెరుగుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు
- ఉద్యోగ విరమణలే.. నియామకాలు కరువు

తెలంగాణలో ప్రభుత్వ విద్య తీరు మారుతుంది. రకరకాల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యా సంస్థల కారణంగా పల్లెబడులు ఎత్తివేత ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. అంతేకాదు విద్యాశాఖలో రెగ్యులర్ ఉద్యోగుల స్థానే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ప్రభుత్వ విద్యాలయాల స్థాపన ప్రభుత్వ పాఠశాలల నుండి ఇప్పుడు ఏర్పాటు చేస్తున్న పాఠశాలలకు విద్యార్థులను రప్పిస్తుందే తప్ప ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించలేని పరిస్థితి నెలకొన్నది. ఇక విద్యాశాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు తప్ప డిఎస్‌సిల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు ఉండకపోవచ్చు.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో



# మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం




- ఆర్థిక స్వాలంబన దిశగా మహిళల అడుగులు
- ఉచిత బస్సుతో మహిళలకు రూ.10వేల కోట్లు ఆదా
- ఎంఎల్‌ఏ కూనంనేని

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** మహిళా సాదికారతకు చేదోడుగా వాదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని,ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభి వృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీ ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో గురు వారం కొత్తగూడెం ఆర్టిసిబస్టాండ్ ఆవరణలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికసదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి కూనంనేని ముఖ్యాతిధిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా ఈపథకం ఓ వరంగా మారిందని, నిత్యం విధు లకు వెళ్లే వారికి ఇది ఊరటనిచ్చిందన్నారు. ప్రతీ రోజు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సును సద్వినియోగం చేసుకుంటున్నారని, ఇప్పటి వరకు

మిగతా 2లో..

# ఆర్థిక ఆధిపత్యం కోసమే యుద్ధం




- ఆర్థిక వనరులను వశపర్చుకునే యత్నంలో అమెరికా
- ప్రొ॥ బుడ్డిగ జమీందార్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్థిక ఆధిపత్యం కోసమే అమెరికా ఇరాన్‌తో యుద్ధం చేస్తుందని ప్రొ॥ బుడ్డిగ జమీందార్ తెలిపారు. ప్రపంచంలోని ఆర్థిక వనరులను వశపర్చుకునేందుకు అమెరికా ఇటువంటి ఘాతుకాలకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జెడ్పి మీటింగ్ హాల్‌లో అమెరికా ఇరాన్ యుద్ధంపై సెమినార్ నిర్వహించారు. ఆవుల అశోక్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో బుడ్డిగ జమీందార్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద లక్షణాలలో ప్రధానమైంది ఆర్థికంగా బలపడటం రెండవది మిలటరీలు బలపర్చుకోవడం, మూడవది ఆధిపత్య వ్యాపారమని అందులో భాగంగానే అపారమైన ఆయిల్ సంపద కలిగిన ఇరాన్‌పై అమెరికా దాడికి ప్రయత్నిస్తుందన్నారు. ప్రపంచ దేశాల్లో మిలటరీపై ఖర్చు చేస్తున్న మొత్తంలో 40 శాతం ఒక అమెరికానే ఖర్చు చేస్తుందని 80 దేశాల్లో 800 చోట్ల తన స్థావరాలను ఏర్పాటు చేసుకుందన్నారు. వివిధ రకాల బెదిరింపులతో ప్రధానమైన దేశాలని

మిగతా 2లో..

# దారి మారుతున్న ప్రభుత్వ విద్య..!

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్న గురుకులాలకు తోడు మోడల్స్ స్కూల్స్, సమీకృత విద్యాలయాలు ఇలా పలు పేర్లతో ప్రభుత్వ విద్యా సంస్థలను నెలకోల్పుతుంది. రెసిడెన్షియల్, సెమి రెసిడెన్షియల్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తుంది. ఈ సంస్థల ఏర్పాటుతో పల్లెబడులు పూర్తిగా మూతపడే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు రెసిడెన్షియల్, సెమి రెసిడెన్షియల్ బాట పడితే పాఠశాలలు మూతపడక తప్పదు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. నూతన విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం ఆ స్థాయిలో నియామకాలు చేపట్టడం లేదు. ఎక్కువగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలకు మొగ్గుచూపుతుంది. వీరికి వేతనాలు చాలా తక్కువ డిపి టిఏ ఇతర అలవెన్సులు ఇచ్చే అవసరం లేదు. ఒక రాజకీయ నేత వ్యాఖ్యానించినట్లుగా ఒక సీనియర్ ప్రభుత్వ ఉపాధ్యాయునికి ఇచ్చే వేతనంలో ముగ్గురు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను నియమించవచ్చు అన్నట్లు ప్రభుత్వం కూడా అదే రీతి వ్యవహరిస్తుంది. ప్రభుత్వ విద్య మోడల్స్ స్కూల్స్, సమీకృత విద్యాలయాలు, గురుకులాల పేరుతో కేంద్రీకృతమవుతుంది. ప్రభుత్వ విద్య బలోపేతం విస్తృతంగా వివిధ రకాల పేర్లతో విద్యాలయాల ఏర్పాటును స్వాగతించక తప్పదు కానీ ఇప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. వివిధ రకాల ప్రచారాల నేపథ్యంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివితే మా పిల్లలు ఉన్నతులు కాలేరన్న భావన తల్లిదండ్రుల్లో నాటుకుపోయింది. మధ్య, ఎగువ మధ్యతరగతి కుటుంబాల్లో విద్య, వైద్యానికి చేసే ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ విద్యా సంస్థలపై తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగే వరకు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

**ఫీజులు, అనుమతులపై పట్టింపేదీ...?**

ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు, అనుమతులపై విద్యాశాఖాధికారులకు పట్టింపు లేకుండాపోయింది. కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు శిక్షణ పొంది ప్రతిభ కలిగిన బోధన సిబ్బందిని నియమించడంతో పాటు విద్యార్జనకు కావాల్సిన అన్ని వసతులు కల్పించి తదనుగుణంగా ఫీజులు నిర్ణయిస్తున్నారు. బోధన సిబ్బంది, వసతుల కల్పనలో పోటీపడలేని ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీ పడుతున్నాయి. కొన్ని విద్యా సంస్థల్లో అర్హత కలిగిన బోధన సిబ్బంది లేరు. ఈ విషయం విద్యాశాఖాధికారులకు తెలిసినా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. బహుళ అంతస్తుల అద్దె భవనాల్లో ప్రైమరీ తరగతులు నిర్వహించరాదన్న కనీస నిబంధన పాటించడం లేదు. అనుమతుల విషయంలో విద్యాశాఖ తీరు ఎద్దు ఈనిందంటే గాటికి కట్టెయ్యమన్నట్లుగా ఉంది. పాఠశాల ఒక చోట ఆట స్థలం మరో చోట అయినా ఓకే అంటున్నారు అధికారులు. అన్నింటికి మించి గతంలో కళాశాలలకే పరిమితమైన కార్పొరేట్ ఇప్పుడు నగరాలు, పట్టణాలు దాటి పల్లెల్లో పాఠశాలలను ఏర్పాటు చేసి రకరకాల పేర్లు పెట్టి ఫీజుల వసూళ్లతో తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నాయి. కార్పొరేట్ పడగ విప్పడంతో అనేక దశాబ్దాలుగా విద్యా రంగాన్ని నమ్ముకుని విద్యా సంస్థలు నిర్వహించిన వారు ఇప్పుడు సంస్థలను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటులో ఫీజులను నియంత్రించడంతో పాటు నియమ, నిబంధనల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలి. తల్లిదండ్రుల దృష్టి ప్రభుత్వ విద్య వైపు మరలే వరకు ఈ దుస్థితి తప్పదు.

## మహిళా సాధికారతకు
# చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 290 కోట్ల జీరో టిక్కెట్లు నమోదయ్యాయయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ.10 వేల కోట్లు మేరా ఆదా అయ్యాయని చెప్పారు. ప్రజాపాలనలో భాగంగా ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకుని లబ్దిపొందిన మహిళలను ఎంఎల్‌ఏ శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై నాగేశ్వరరావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై గ్రామ సభల్లో ఆర్జీలు




**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రజాపాలన్ 99 రోజుల ప్రజా ప్రణాళికలో భాగంగా సింగరేణి మండలంలోని 41 గ్రామ పంచాయితీలలో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో సర్పంచుల అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలలో అధికారులు ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ఏకరవు పెట్టారు. గ్రామ సభలకు వచ్చిన ప్రజలు సమస్యలపై ఆర్జీలను ఇచ్చారు. తాము ఇంతకు ముందు పెట్టిన పెన్షన్, సాదామైనామా దరఖాస్తుల పురోగతిపై అధికారులను ప్రశ్నించారు. గ్రామ సభలు ఉదయం 9గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా, మిర్చి ఏరివేత, కోతుల కాపలకు గ్రామస్తులు చేను పనులకు వెళ్లటంతో 11గంటల తర్వాత సభలు అధికారులు ప్రారంభించారు. ఈ గ్రామ సభలలో ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, తహసీల్ధార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# తునికాకు వేళాయె..!

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రతీ ఏటా తునికాకు సేకరణ జిల్లాలోని పలు ప్రాంతాల గిరిజన, గిరిజనేతరులకు ఆదాయం తెచ్చి పెడుతోంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ కొమ్మ కొట్టే పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాస్తవానికి డిసెంబర్, జనవరి మాసాల్లో పూర్తి కావాల్సిన టెండర్ల ప్రక్రియ మార్చి నెలలో పూర్తయ్యాయి. ఫిబ్రవరి చివరి వారం, మార్చి మొదటి వారంలో కొమ్మకొడితేనే తప్ప నాణ్యమైన ఆకు రాదని, కొమ్మకొట్టిన 40 రోజుల తర్వాత ఆకు సేకరణ మొదలు పెట్టాల్సి ఉంటుందని గిరిజనులు చెబుతున్నారు. ఏప్రిల్ మెదటి వారం ప్రవేశించినప్పటికీ కొమ్మకొట్టే పనుల్లో వేగం మందగించిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆకు కోసం తునికాకు సేకరణలో కోసం గిరిజనులతో పాటు గిరిజనేతరులు, విద్యార్థులు ఎదురుచూస్తుంటారు. సాధారణ పంటలు పూర్తయిన తర్వాత ఇళ్ల వద్ద ఉండే గ్రామీణ, అటవీ ప్రాంతాల ప్రజలకు ఈ తునికాకు సేకరణ ఆదనపు ఆదాయాన్ని సమకూరుస్తుంది. దీని ద్వారా వచ్చే ఆదాయంతో వారు శుభకార్యాలకు హాజరు కావడంతో పాటు పలురకాల వెండి, బంగారు ఆభరణాలను కొనుగోలు చేస్తుంటారు. వేసవి సెలవుల్లో ఇళ్లవద్దే ఉండే విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి తునికాకు సేకరణ వెళ్లి వచ్చిన ఆదాయంతో దుస్తులు,పుస్తకాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ, పాల్వంచ అభయారణ్యం, కొత్తగూడెం డివిజనలో కల్లాలు ఉండగా వీటి మొత్తంగా 33600 స్టాండర్డ్ బ్యాకుల ఆకు సేకరణ లక్ష్యంగా పెట్టారు. ఈ వేసవిలో సుమారు 25 వేల మంది కార్మికులు తునికాకు సేకరణ ద్వారా ఉపాది పొందుతుంటారు. నానాటికీ తగ్గుతున్న ఆకు తునికాకు నానాటికీ తగ్గిపోతోంది. గతంలో లక్ష్యాలను మించి ఆకును సేకరించే వారు ఇప్పుడు నిర్ణయించిన టార్గెట్‌ను సగానికి కూడా చేరుకోలేక పోతున్నారు. పోడుభూముల వల్ల తునికి చెట్లు మొట్లతో పాటు పెకిలించి వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పోడు భూములు ఉన్నాయి. ఈ భూములన్నింటిలో కూడా విస్తారంగా నాణ్యమైన తునికాకు లభించేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.ఈ పోడు భూములు గిరిజనుల బ్రతుకుల్లో వెలుగులు నింపుతున్న విషయం సంతోషదాయకమైనప్పటికీ రానును తునికాకు లభ్యతకు ఇబ్బందులు తప్పేలా లేవు. దేశవ్యాప్తంగా చూస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాణ్యమైన తునికాకు లభ్యం కానుండటంతో కాంట్రాక్టర్లు ఇటువైపే టెండర్లు దక్కించుకునేందుకు మొగ్గు చూపుతుంటారు. ఆకు లభ్యత అంతంత మాత్రంగానే ఉండటంతో కాంట్రాక్టర్లలో కూడా ఆసక్తి సన్నగిల్లుతోంది.

## మండలం వ్యాప్తంగా రసాభాసగా గ్రామసభలు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** రాష్ట్ర ప్రభుత్వం చేపటిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలు తిరుమలయపాలెం మండల వ్యాప్తంగా రసభసగా జరిగాయి. ప్రతి గ్రామపంచాయతీలో ప్రభుత్వ హామీలపై ప్రజలు నిలదీశారు. ఇస్తానన్న హామీలు ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సర్పంచులను మరియు పంచాయతీ కార్యదర్శులను వివరణ అడిగారు. అదేవిధంగా పంచాయతీ కార్యాలయాల సమస్యలపై అధికారులను ప్రజలు నిలదీశారు. చెత్త సేకరణ ట్రాక్టర్, పరిశుభ్రత, తాగునీటి సమస్య, వీధిలైట్లు, ఫాగింగ్ వంటి సమస్యలు కూడా పరిష్కరించడం లేదంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఇదిలా ఉంటే మరి కొన్ని గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలకు వచ్చిన ప్రజలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా నిర్వహించారని అక్కడ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామసభలను నిర్వహించమా లేదా అన్నట్టుగా అలా ఏర్పాటు చేసి ఇలా ఇంటిదారి పట్టారని కొన్ని గ్రామపంచాయతీల ప్రజలు తెలుపుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు లేని గ్రామసభల్లో ప్రత్యేక అధికారులు నిర్వహించగా అక్కడ పరిస్థితి కూడా అదే విధంగా ఉందని ప్రజలు చెప్పకు వచ్చారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, గ్రామసభల ఉద్దేశం పూర్తిగా అధికారులు వివరించలేదని, ఈ గ్రామ సభలు ఏ ఉద్దేశంతో కూడా నిర్వహించారు మాకు అర్థం కాలేదని ప్రజలు చెప్పుకొస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల మెరుగుదలపై చర్చించారు. అర్హులైన లబ్దిదారులను గుర్తించి వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్, కార్యదర్శులు హామీ ఇచ్చారు.

# ఆర్థిక ఆధిపత్యం కోసమే యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

తన చెప్పు చేతల్లో ఉంచుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. తొలుత ఇరాన్‌లో విపక్షానికి సాయం అందించి అశాంతిని లేపేందుకు ప్రయత్నించిందని అది సాధ్యం కాకపోవడంతో ఇజ్రాయిల్ సహాయంతో నేరుగా యుద్ధానికి దిగిందన్నారు. ఇజ్రాయిల్ అమెరికాకు 51వ రాష్ట్రంగా పని చేస్తుందని జమీందార్ ఆరోపించారు. ఇరాన్ ద్వారా చైనా సహా పలు అభివృద్ధి చెందిన దేశాలు ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నాయని దీనిని గమనించిన అమెరికా ఇరాన్‌ను ఆక్రమించడం ద్వారా ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న దేశాలను నియంత్రించవచ్చునన్న ఆలోచనతోనే యుద్ధానికి దిగిందని కాకపోతే ఇరాన్ బలాన్ని చాలా తక్కువగా అంచనా వేసిందన్నారు. రోజు రోజుకు ప్రపంచ దేశాలలో అమెరికా పట్ల వ్యతిరేకత పెరుగుతుందని ఒక అమెరికాలోనే లక్షలాది మంది యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేశారని యుద్ధం ఎవరి కోసమంటూ అమెరికా ప్రజలు ప్రశ్నిస్తున్నారని జమీందార్ తెలిపారు. చైనా బలపడుతుండటం పోటీ దేశంగా ఎదుగుతుండటం అమెరికాకు నచ్చడం లేదన్నారు. ఇరాన్ ఆయిల్ సంపదను వశపర్చుకోవడం ద్వారా ప్రపంచ దేశాలను శాసించవచ్చునన్న ఆలోచన ట్రంప్‌కు కలగడం వల్లే ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధం జరుగుతుందన్నారు. ఇరాన్ పశ్చిమాసియాలోని కొన్ని దేశాల మీద యుద్ధం చేస్తున్నట్లు ప్రకటిస్తున్నారని కానీ పశ్చిమాసియా దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపైన మాత్రమే ఇరాన్ యుద్ధం చేస్తుందని జమీందార్ తెలిపారు. యుద్ధాల వల్ల సామాన్య ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లనుందని నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయని ఆయన తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాన్ని అలీన దేశంగా పేరొందిన భారత్ ఖండించకపోవడం దారుణమన్నారు. మోడీ ట్రంప్‌కు సాగిల పడుతున్నారని ఆయన తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని జమీందార్ తెలిపారు.ఈ సెమినార్‌లో సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, టిపిటిఎఫ్ మాజీ కార్యదర్శి వి. మనోహర్‌రాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామయ్య, సివై పుల్లయ్య, బందెల వెంకయ్య, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహం వద్ద పార్క్‌ను ఏర్పాటు చేస్తాం







**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత అధ్యక్షతన జరిగిన వార్డు సభ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ, వైరా ఎస్సై రామారావు పాల్గొన్నారు. తొలుత గాంధి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈస ందర్భంగా కౌన్సిలర్ మాదినేని సునీత వార్డులో గాంధి పార్క్ అభివృద్ధి పబ్లిక్ టాయిలెట్లు నిర్మాణం గురించి మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ మనందరం అభివృద్ధిలో భాగస్వామ్యం మన చుట్టూ ప్రాంతాల్లో చెత్తను ఎక్కడిపడితే అక్కడ వేయకుండా నివారించేందుకు ముందు చర్యలు చేపట్టడం మన బాధ్యత అన్నారు. ఎస్సై పుప్పాల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జి మేనేజర్ సుధీర్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ భాస్కర్, యుడిసి ప్రదీప్, బిల్‌కలెక్టర్ విక్రాంత్, ఆర్పి బి.సునీత, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఆశా వర్కర్ మహేశ్వరి, మున్సిపాలిటీ సిబ్బంది, వార్డు పెద్దలు మాదినేని ప్రసాద్, కట్ల నాగేశ్వరరావు, కట్ల నాగరాజు, మిట్టపల్లి కిరణ్, కొల్లా రాంబాబు, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల రామారావు, కొత్తూరు రమణ, రేచర్ల విశ్వనాథం, రేచర్ల వెంకటేష్, మాదినేని లక్ష్మణ్, ఏడునూతల బుచ్చిరామారావు, రేచర్ల పుల్లయ్య పాల్గొన్నారు.

## భూ భారతి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్




**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** భూ భారతి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసిలో అదనపు కలెక్టర్ వేణు గోపావరావుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి పెండింగ్ పై పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలన్నారు. ప్రజావాణిలో భూ సమస్యలపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జనగణనకు సంబంధించి అన్ని ఏర్పాట్లుపూర్తి చేసి తహశిల్దార్ల ఐడి క్రియేషన్ వేగవంతంగా చేయాలని, పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిని నియమించాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాపై వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక రీచ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, ఇప్పటి వరకు నమోదు చేసిన కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

# మున్సిపల్ క్వార్టర్స్‌ను క్రమబద్ధీకరించాలి : బిజి క్లెమెంట్



**-43వ డివిజన్‌లో ఏకగ్రీవ తీర్మానం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలోని మున్సిపల్ క్వార్టర్స్‌ను వాటిలో నివసిస్తున్న మున్సిపల్ కార్మికుల పేర క్రమబద్ధీకరించాలని సిపిఐ ఫ్లోర్ లీడర్, 43వ డివిజన్ కార్పొరేటర్ బిజి క్లెమెంట్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికలలో ఎక్కువ మంది 43వ డివిజన్‌లోనే ఉన్నారని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 43వ డివిజన్ సభ గురువారం బిజి క్లెమెంట్ అధ్యక్షతన జరిగింది. పెద్ద సంఖ్యలో సభకు డివిజన్ ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో బిజి క్లెమెంట్ మాట్లాడుతూ క్వార్టర్స్‌ను ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఎక్కడో స్థలాలు ఇవ్వడం కాకుండా ప్రస్తుత క్వార్టర్స్‌లో మౌలిక వసతులు కల్పించి కార్మికులకే స్వాధీనపర్చాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. కమ్యూనిటీ హాల్ ప్రజలకు ఉపయోగపడేదని దానిలో కోచింగ్ సెంటర్ ఎత్తివేసి ప్రజలకు ఉపయోగపడేవిధంగా తీర్చిదిద్దాలని కోరారు. డివిజన్‌లో వేసవి నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు 24 గంటలు వచ్చేవిధంగా రెండు నీటి పంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం, ఆరు గ్యారెంటీలకు సంబంధించి పెద్ద సంఖ్యలో అధికారులకు దరఖాస్తులు అందజేశారు. మున్సిపల్ క్వార్టర్స్‌ను క్రమబద్ధీకరించాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సభలో డివిజన్ ప్రత్యేకాధికారి సుధాకర్, వార్డు ఆఫీసర్ ఇమ్రాన్, డివిజన్ బాధ్యులు కె. గురుమూర్తి, కె. సతీష్‌రెడ్డి, కాంపాటి వెంకన్న, పి. రామమూర్తి, విద్యుత్ అధికారి రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వెలవెలబోయిన గ్రామసభలు

**- ప్రజలు లేక నామమాత్రంగా సమావేశాలు**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీలోని 32 వార్డుల్లో నిర్వహించిన 99రోజుల ప్రణాళిక గ్రామ సభలు ప్రజలు లేక వెలవెలబోయాయి. ఈ గ్రామ సభలపై ముందస్తు సమాచారం సరైన విధంగా అందకపోవడంతో ప్రజలు హాజరు కాలేకపోయినట్లు తెలిసింది. ప్రధానంగా నూతన మున్సిపాలిటీతో పాటు కౌన్సిలర్లు, అధికారులు కొత్తవారు కావడంతో ప్రజా సమస్యలపై కొంత అవగాహనలోపం కనిపించింది. ఈ నేపథ్యంలో సమస్యలను తెలియజేయడానికి ప్రజలు చేసిన ప్రయత్నాలు కూడా తక్కువగానే కనిపించాయి. చాల చోట్ల కేవలం వినతిపత్రాలు స్వీకరించడానికే గ్రామ సభలు నిర్వహించినట్లు కొనసాగాయి. అలాగే పలువురు కౌన్సిలర్లు, అధికారులు మైకు పట్టుకొని సమస్యలపై మాట్లాడేందుకు కొంత విముఖత చూపినట్లు తెలిసింది. అయితే కొన్ని వార్డుల్లో సమస్యలపై చర్చలు చోటు చేసుకున్నాయి. 23వ వార్డులో గంజాయి సమస్యపై తీవ్ర చర్చ జరిగింది. కొందరు ఆకతాయిలు స్థానిక అంగన్వాడీ పాఠశాలలో గంజాయి సేవిస్తున్నట్లు టీచర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే 29వ వార్డులో గల రైస్‌మిల్ సమస్యపై స్థానికులు సభలో ఏకరువుపెట్టారు. రైస్‌మిల్ కారణంగా అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, వెంటనే దానిని తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా పంచాయతీలలో సాగిన గ్రామ సభలు అంతంత మాత్రంగానే జరగడం విశేషం. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, చైర్ పర్సన్ పొకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, ఎంపిడిఓ శ్రీదేవి, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రత్యేకధికారులు, స్థానిక రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమా



**ప్రజాపక్షం/చింతకాని :** రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని త్వరలో ప్రభుత్వం అమలు చేయనున్నట్లు మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చింతకాని మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. నాగులవంచ గ్రామంలో జరిగిన గ్రామసభలో అంబటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వచ్చే విద్యాసంవత్సరం నుండి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం , 500లకు గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, వంటి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ఆయా గ్రామ సభల్లో ప్రభుత్వ అధికారులు ప్రజా పాలనలో పేదలకు అందించిన అభివృద్ధి ఫలాలను శాఖల వారీగా వివరించారు. గ్రామ సభల్లో తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారులు, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే ఇంటింటి సిపిఐ



**ప్రజాపక్షం/ బోనకల్ :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికే ఇంటింటి సిపిఐ క్యాక్రమాన్ని చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు వెల్లడించారు. గురువారం మండల పరిధిలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ఇంటింటి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవిందాపురం(ఎల్) గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. చాలా మంది ఇందిరమ్మ ఇళ్ల సమస్యను తమకి తెలియచేశారన్నారు. గోవిందాపురం(ఎల్) గ్రామంలో కౌలు రైతులు ఎక్కువ మంది ఉన్నారని, ఇక్కడి నుండి మధిర లేదా బోనకల్ ప్రాంతాలకు మొక్కజొన్నను తరలించడం ఇబ్బందికరమైన పరిస్థితి అన్నారు. బోనకల్ మండలంలో ఉన్న ఐదు వ్యవసాయ క్లస్టర్లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో సమస్యలు తీసుకోవడానికి తాము ప్రయత్నించినప్పుడు ఎస్కే. నసీమాకు తడికల ఇల్లు ఉన్నట్లు తాము గమనించామన్నారు. ఎస్కే రజీయా, ఎస్కే సుల్తాన్, కయితపల్లి ప్రమీల, షేక్.రసూల్‌బీ, పుచ్చకాయల చిన్న తిరుపతయ్య, షేక్. సైదాబీ తదితరుల ఇల్లు మంజూరు చేస్తామని గతంలో చెప్పారని, కాని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రామారావు, షేక్. బ్రహ్మం, యువజన నాయకులు జక్కుల నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి : సిపిఐ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేరళం ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పినరయ్ విజయన్ పట్ల చేసిన వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. విజయన్‌ను మోడీతో పోల్చటం అంటే రాజకీయ పబ్బంగడుపుకోవటమేనని బలమైన సిద్ధాంత బలంతో పనిచేసే ఎల్‌డిఎఫ్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. బిజెపి వ్యతిరేక ఫ్రంట్‌లో వామపక్షాలు ఉన్నప్పుడు రేవంత్ రెడ్డికి ఈ విషయాలు గుర్తుకు రాలేదా అని సురేష్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఏమి చూసి విజయన్‌ను మోడీతో పోల్చారని అధికారంలోకి రావడం కోసం ఇంత దిగజారుడు ప్రచారం తగదన్నారు. రాష్ట్రానికి ఒక మాట చెప్పి ఎన్నికలలో లబ్ది పొందాలని చూస్తే ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు.

# డంపింగ్ పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ 7వ వార్డులోని చెరువు వద్ద పోస్తున్న డంపింగ్‌ను రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. దీనిని కొనకటి కృష్ణ రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చూసి అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయేందర్‌రెడ్డి, ఆర్ఐ ప్రసాద్, జీపీఓ వీరబాబు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# భారీ సిలువ పాటుల ప్రదర్శన

**- విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపిన బిషప్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** గుడ్ ఫ్రైడే సందర్భంగా నేడు, రేపు ఖమ్మంనగరంలో అక్కడి కతోలిక సంఘం ఆధ్వర్యంలో భారీ సిలువ పాటుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు బిషప్ సగిలి ప్రకాష్ తెలిపారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీలోని నాయుడుపేటలో గల బిషప్‌హౌస్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మానవాళి రక్షణ కోసం ఏసు ప్రభువు తన త్యాగం ద్వారా శాంతి, కరుణ సందేశాన్ని ప్రపంచానికి అందించారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా గుడ్ ఫ్రైడే నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ఖమ్మం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని చర్చి వద్ద నుంచి ప్రారంభమయ్యి. సిలువ పాటు ప్రద్శన జెడ్పీ సెంటర్, ఎన్‌టీఆర్ సర్కిల్, కొత్త బస్టాండ్ మీదుగా కరుణగిరి వరకు ప్రార్థనల మధ్య జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో వేలాదిమంది భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రశాంతంగా, క్రమశిక్షణతో సాగేందుకు ప్రజలు, పోలీసులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇంచార్జ్ ఫాదర్ గోవాశౌరయ్య, ఫైనాన్స్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ గోవా,శౌరయ్య, ఫైనాన్స్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఐజాక్, జాన్ మజ్ను, విచారణ గురువులు ఫాదర్ సురేష్, ఫాదర్ బేసురాజు, బిషప్ సెక్రటరీ ఫాదర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌కు యూరియా రాక

**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే ర్యాక్ పాయింట్‌కు గురువారం 2676 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. రైల్వే వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియాను ఖమ్మం జిల్లాకు 1176 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి జిల్లాకు 800 మెట్రిక్ టన్నులు, మహబూబాబాద్ జిల్లాకు 500 మెట్రిక్ టన్నులు, ఖమ్మం సీఆర్పీకి 200 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఈ యూరియాను లారీలు , ట్రాక్టర్ల ద్వారా ఆయా జిల్లాలోని సహకార సంఘాలకు , ప్రైవేటు ఎరువుల దుకాణదారులకు పంపిణీ చేశారు.

# తాటిచెట్టు పైనుంచి పడ్డ గీత కార్మికుడు



**ప్రజాపక్షం/చింతకాని :** మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామానికి చెందిన బజ్జూరి వెంకటేశ్వర్లు (70) గీతకార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యారు. గ్రామస్థులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా సిబ్బంది కోట భానుసహాన్, ఎంఎం చక్రవర్తి లు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 41వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. గురువారం రూ. 30 లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి డివిజన్‌లో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైన్ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ప్రజలకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికతో సమస్యల పరిష్కారం : కూనంనేని



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ముందుకు సాగుతుందని, దీనికి అధికారులు, పాలక వర్గాలు సహకారం అందించాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్ గ్రామపంచాయితీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ భూక్య శాంతి శ్రీ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని, ఇప్పటికే పంచాయితీలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. ఈ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మంచి నీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందాలని, పారదర్శకమైన పాలనతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సభలో ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళీ, , మండల స్పెషల్ ఆఫీసర్ డిఏఇఓ వెంకటేశ్వరరావు, ఇఓ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, పంచాయితీ గుమస్తా రామకృష్ణ, బిల్ కలెక్టర్లు అమర్ నాధ్, సురేష్, కిషోర్, బోస్, పిచ్చయ్య, శానిటేషన్ సూపర్వైజర్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై జావాబుదారీతనం అవసరం



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులపై పంచాయితీ పాలక వర్గం జవాబుదారీగా వ్యవహరించాలని సీపీఐ(ఎం)నేత కొండెబోయిన నాగేశ్వరరావు అన్నారు. సింగరేణి గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పాలక వర్గం సమన్వయంతో పని చేయాలని సూచించారు. భూమి ఆక్రమణల నివారణ, హాస్టల్ భవనాలు, డిగ్రీ కాలేజీ, బస్ షెల్టర్, మరుగుదొడ్ల వినియోగం, మునిగే ప్రభుత్వ భవనాల సమస్య పరిష్కారం చేపట్టాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులందరికీ మంజూరు, రైల్వే బాధితులకు నష్టపరిహారం, నీటి కొరత నివారణ, కోతులు, కుక్కల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సబ్సిడీ జమ, ఆత్మీయ భరోసా చెల్లింపులు, ఎన్ఆర్ఈజీఎస్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

## ప్రాణ రక్షకులు, ఆపద్బాంధవులు 108 ఈఎంటిలు



**ప్రజాపక్షం/కరకగూడెం:** ఏదైనా ప్రమాదం, ఆపద జరిగిందని కాల్ తీసుకున్న సమయం నుండి త్వరగా ప్రమాద స్థలానికి చెరుకుని గాయాల పాలైన వ్యక్తికి ప్రథమ చికిత్స చేసి ఆంబులెన్స్ లో ఎక్కించుకుని త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లి వారి ప్రాణాలను కాపాడటంలో మన ఈఎంటిలు కీలకపాత్ర పోషించడం, ఈఎంటిలు లు ఎల్లప్పుడు క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించడం చాల అభినందనీయం. ఈ సందర్భంగా మన తోటి 108 ఈఎంటిలందరికీ పేరు పేరున హృదయపూర్వక శుభాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, సునీత, సాయి సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామసభ పేరుతో ప్రజలను పిచ్చోళ్ళని చేసిన ప్రభుత్వం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రజాపాలన గ్రామసభలు పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని సిపిఐ నేత నరాటి ప్రసాద్ ఆరోపించారు. ములకలపల్లి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు హాజరుకాకుండానే ప్రగతి నివేదికలు ఎలా చెప్పగలరని ప్రశ్నించారు. తహసీల్దార్, ఎంపీడీవో సహా అధికారులు లేకుండా గ్రామ సభలు నిర్వహించడం ఆశ్చర్యకరమన్నారు. నిధులు, ప్రణాళిక లేకుండా ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యం కాదని విమర్శించారు. గ్రామసభలో సీసీ రోడ్లు, చెరువు అభివృద్ధి, రోడ్డు సదుపాయాలు, చెత్త సేకరణ కోసం ట్రాలీ ఆటో కొనుగోలు తదితర సమస్యలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లలితారావు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## పట్టాలున్న పోడు భూములకు రైతుభరోసా ఇవ్వాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** గత ప్రభుత్వంలో ఇప్పటి ప్రభుత్వంలో గత మూడు దశాబ్దాలుగా గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు వచ్చినవి కానీ కొంతమందికే రైతు భరోసా ఇస్తున్నారు పట్టా వచ్చిన ప్రతి ఒక్కరికి రైతు భరోసా ఇవ్వాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు గౌరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం తిమ్మంపేట గ్రామంలో జరిగిన గ్రామ సభలో సర్పంచి తుర్రం శ్రీనుకు వినతి పత్రం ఇచ్చి మాట్లాడుతూ గతంలో సర్వే చేయగా కొన్ని అనివార్య కారణాలతో పట్టాలు ఆలస్యం అయినవి వాటికీ ప్రభుత్వం వెంటనే రైతు భరోసా మంజూరు చేయాలని, బ్యాంకులు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఎన్నికల హామీ ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గణప సాయిరాం, కాకర్ల సుధాకర్, గౌరి లక్ష్మి , రాజనేని రాజు, నాగేంద్ర బాబు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, సీత, తదితరులు పాల్గొన్నారు.







## సమస్యల పరిష్కారమే ద్యేయంగా పని చేస్తాం

### ఎంఎల్ఏ కూనంనేని సారద్యంలో అభివృద్ధి చేసుకుందాం : సిపిఐ కార్పోరేటర్లు

**ప్రజాపక్షం/పాల్వంచ :** డివిజన్ ప్రజల సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారమే ద్యేయంగా పని చేస్తామని కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ పరిధి కార్పోరేటర్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ లో గురువారం పాల్వంచలోని మంచికంటి నగర్, సీతారామపట్నం, గాంధీనగర్, పాత ఆర్డిఓ కార్యాలయం, పాత పాల్వంచ, బాపూజీనగర్లతో పాటుగా మొత్తం 27 డివిజన్ల ప్రాంతాలలో కార్పోరేటర్ల అధ్యక్షతన గురువారం గ్రామ సభలను నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సంధర్భంగా తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. స్పెషలాఫీసర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని, ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అబ్దిదారుల వివరాలను తెలిపారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను కార్పోరేటర్లు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా నిరు పేదలు ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు, తాగు నీరు, విద్యుత్, విద్యా, వైద్యం, మరియు డివిజన్‌లలో నెలకొన్న డ్రైనేజీలు, దోమల నివారణకు ఫాగింగ్, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై వినతి పత్రాలను చేశారు. అనంతరం 31, 35, 41, 40, 44, 47 డివిజన్‌ల కార్పోరేటర్లు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంటేశ్వర్లు, గొర్లె అన్నపూర్ణ, నామా కీర్తి, నునావత్ శ్యామలలు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా పాల్వంచకు ఎన్నికలు లేకపోవటంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పాల్వంచను అన్ని విధాలుగా డెవలప్ చేసేందుకు ఎన్ని అవాంతరాలు ఎదురైనా అన్నింటిని అధిగమించి కొత్తగూడెం, పాల్వ ంచ, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయితీలను కలిపి కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ ఏర్పాటు చేసి పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావుకే దక్కుతుందన్నారు. కూనంనేని సారద్యంలో పాల్వంచను అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలబెదామని కోరారు. అందుకు మనమంతా కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికే వందల కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. నూతన రేషన్ కార్డులు, ఆసరా పింఛన్‌లు, గృహజ్యోతి, రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిభంధనలకు లోబడి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, తంతెనపల్లి వేంకటేశ్వర్లు, బర్ల వెంకటరత్నం, మేడిద రూపస్, శనగ శ్రీను, భరద్వాజ్, కాల్వ గోపాలస్వామి, నామా నవీన్, నామా పందు, డివిజన్ సిపిఐనాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**- సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి:**

సమస్యలపై అవగాహనతో గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఎంపిడిఓ బొగ్గా నారాయణ అన్నారు. తోగ్గూడెం, కేశవాపురం గ్రామాలలో జరిగిన గ్రామ సభలో గురువారం మండల స్పెషలాఫీసర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రోగ్రాంలో భాగంగా గురువారం మండల పరిధి 36 గ్రామ పంచాయితీలలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహించారు. ఈ సంధర్భంగా రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ వినిపించారు. ముఖ్యమంత్రి సందేశాన్ని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతు భరోసా, సన్న దాన్యానికి బోనస్, నూతన రేషన్ కార్డుల లబ్దిదారుల వివరాలను తెలియజేశారు. ప్రజలు డబుల్‌బెడ్‌రూమ్‌లు, వితంతు, వృద్దాప్య, ఒంటరి మహిళల తదితర ఫింఛన్‌లపై ధరఖాస్తులను అందజేశారు. పారిశుద్ధ్యం, వీధి లైట్లు, ఏడ్రైనేజీలు, అంతర్గత రహదారుల పరిష్కరించాలని వినతి పత్రాలను సమర్పించారు. సమస్యల పరిష్కారానికి చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, యువత, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## పక్కదారి పట్టిన రూ. కోట్ల ప్రజాధనం

- బిల్లులు కడుతున్నా తరగని బాకీలు
- సిబ్బంది ఫోన్‌లు తనిఖీ చేస్తే బట్ట బయలు కానున్న అక్రమాలు
- అక్రమాలలో ఎవరి పాత్ర ఎంత
- కోర్టు ఆర్డర్లు సైతం అమలు చేయని అధికారులు
- సిబ్బంది మధ్యవర్తులటా..?




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అందరూ శాఖాహారులే.. మరి రొయ్యల మూట ఏమైందన్నట్లు, అందరూ నిజాయతీపరులే అయితే సత్తుపల్లి మున్సిపాలిటీలో కోట్ల రూపాయలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీలోని అధికారులు, సిబ్బంది పనితీరు. సుమారు 14 కోట్ల రూపాయల టాక్స్ లు వసూలు కాలేదని ఏసీబీ అధికారులు విడుదల చేసిన ప్రెస్ నోట్ లో కనిపిస్తుండగా, వాస్తవంలోకి వచ్చే సరికి భారీగానే పక్కదారి పట్టినట్టు పట్టణ ప్రజలు మున్సిపాలిటీ తీరుపై బహిరంగ విమర్శలు గుప్పిస్తున్నారు. పట్టణంలో కొందరు భవన నిర్మాణాలను సరైన అనుమతులు లేకుండానే రెండు నుండి ఐదు అంతస్తుల వరకు నిర్మించారు. అటువంటి వారి కోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా పైసలు చెల్లించి అందరూ ఎల్.ఆర్.ఎస్ ను సద్వినియోగం చేసుకున్నారు. కానీ ఏసీబీ తనిఖీలలో మాత్రం సుమారు రూ. 13 కోట్లు వసూలు కానట్లు చూపుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అదే మాదిరి ప్రకటన పన్ను ఒక్క రూపాయి కూడా వసూలు కాలేదని ఏసీబీ తనిఖీలలో కనిపించింది. పట్టణంలోని సుమారు 16 భారీ హోర్డింగ్ లలో ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రకటనలు దర్శనమిస్తుండగా ప్రతి సంవత్సరం ఆ కంపెనీలు మున్సిపాలిటీకి ప్రకటన పన్నును మున్సిపాలిటీ నిర్దేశించిన విధంగా చెల్లిస్తూ ఉంటాయని, ఆ పన్నంతా ఏమైనట్లని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా గత సంవత్సరం సత్తుపల్లి పట్టణంలోని డివైడర్ లను ఓ కాంట్రాక్టర్ కాంట్రాక్టు దక్కించుకొని వాటిలో పట్టణానికి చెందిన పలు ఆసుపత్రులు, రెస్టారెంట్లు, పాఠశాలలు, కళాశాలలు తదితరాలకు చెందిన ప్రకటనలతో నింపి సొమ్ము చేసుకుంటుండగా మరి మున్సిపాలిటీ ఎందుకు ప్రకటన పన్నులు రాలేదని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ కాంట్రాక్ట్ అంతా ఎవరి కనుసన్నల్లో నడుస్తుందని, బండారం బట్ట భయలు కావాలంటే సిబ్బంది ఫోన్లు తనిఖీ చేయాలని, అధికారులు సిబ్బందిని మధ్యవర్తులుగా నియమించి అక్రమాలు జరిపినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. సత్తుపల్లి పట్టణం ఖమ్మం పట్టణానికి సరి సమానంగా ఎదిగిందని, నిర్మాణాలకు టాక్స్ లు పెద్ద మొత్తంలో వస్తున్న రూ కోటి వసూలు కాలేదనడం ఏమిటని ఖజానంత ఎవరి జేబుల్లోకి వెళ్ళాయని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీకి రావలసిన టాక్స్ లు సిబ్బంది యొక్క ఫోన్ పేలలో ఏ విధంగా స్వీకరిస్తారని మున్సిపల్ చట్టానికి విరుద్ధంగా సిబ్బంది వ్యవహరిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని మండిపడుతున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ లో జరుగుతున్న అక్రమాలపై సిఐడి విచారణ జరగాలని, దోషులుగా తేలిన వారిని విధుల నుండి శాశ్వతంగా తొలగించి, వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మున్సిపల్ అవినీతిలో అధికారుల పాత్రకంటే, సిబ్బంది పాత్ర ఎక్కువ ఉందని, మధ్యవర్తులుగా సిబ్బంది వ్యవహరించి, ప్రజలను మభ్యపెట్టి వసూలు చేసిన పన్నులకు బిల్లులు ఇచ్చినా, బాకీలు మాత్రం తీరలేదని మున్సిపాలిటీలో జరుగుతున్న వ్యవహారమంతా పలు అనుమానాలకు భావిస్తుందని పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి పాత మున్సిపల్ కార్యాలయం వరకు ఉన్న వ్యాపారాలు తొలగించాలని కోర్టు ఇచ్చిన ఆర్డర్ ను మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది.

# భూమిలేకున్నా పాస్‌బుక్...

- ❖ జారీపై రెవెన్యూ అధికారులపై ఆరోపణలు
- ❖ అసలు రికార్డుకు మించి పెరిగిన విస్తీర్ణం
- ❖ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వైనం
- ❖ లోకాదళత్‌లో ఫిర్యాదుకు సిద్దమైన బాధితుడు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని భూ రికార్డులపై అనుమానాలు ముసురుకుంటున్నాయి. అసలు రికార్డులో ఉన్న విస్తీర్ణానికి మించిన భూమిని చూపిస్తూ పాస్‌బుక్కులు జారీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలా జారీ చేసిన ఓ పాస్‌బుక్ ఘటన వెలుగులోకి వచ్చింది. అయితే ఉదాంతంపై బాధితుడు మొరపెట్టుకున్నప్పటికీ అధికారులు ఉదాశీనత కనబరచడం విశ్మయానికి గురిచేస్తుంది. ఈ నేపథ్యంలో విసిరివేసారి లోకాదాలత్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇదిలా ఉండగా అక్రమ పద్ధతిలో పాసుబుక్ పొందిన వ్యక్తి ప్రభుత్వ ఖజానాకి గండి కొడుతూ ఓ పక్క రైతుభరోసాను పొందుతూ..మరోపక్క రైతు బీమాను ధీమాగా అర్హతను సాధించిన తీరు విస్తు గొలుపుతోంది.

**● రికార్డుకు మించి విస్తీర్ణం...**

ఆరెకోడు రెవిన్యూలోని 402సర్వే నెంబర్‌లో ఆర్ఎస్ఆర్ ప్రకారం 13.28 కుంటలు ఉండాల్సి ఉంది. కానీ అనదనంగా 1.07 కుంటలు పెంచి 14.35 కుంటలుగా ఎక్సెస్ పెరిగింది. ఈ నేపథ్యంలో 402/ఆ3/1 భూమి లేకున్నా రెవెన్యూ అధికారులు పాస్‌బుక్‌ను జారీ చేశారు. అయితే ఈ పాస్‌బుక్ అందుకున్న వ్యక్తి గతంలోనే భూమి అమ్ముకున్నట్లు తెలిసింది. కానీ తన వద్ద ఉన్న పాత రికార్డులు పెట్టుకొని పాస్‌బుక్ కావాలని దళారి ద్వారా రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. అలాగే అధికారులను మామూలుగా చూసుకోవడంతో అడ్డగోలు దారిలో పాస్‌బుక్‌ను పొందాడు. ఇందులో రాజకీయ నాయకుడు కం దళారి కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినపడుతున్నాయి

**● ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం...**

ఈ వ్యవహారంపై బాధితుడు 2025 మార్చి 24న ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. అయితే ఇంతవరకు సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. పరిష్కారం కోసం పలుమార్లు సంబంధిత కార్యాలయాలకు వెళ్లి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో బాధితుడు నిరాశ వ్యక్తం చేస్తున్నాడు. అంతేకాకుండా సమాచార హక్కు చట్టం కింద కూడా భూ వ్యవహారానికి సంబంధించిన వివరాలను కోరుతూ ధరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి సమాచారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

**● ప్రభుత్వ ఆదాయానికి గండి...**

అక్రమ పద్ధతిలో పాస్‌బుక్ పొందిన వ్యక్తి ప్రభుత్వ ఆదాయానికి అధికారుల సాక్షిగా గండి కొడుతున్నాడు. పొందిన పాస్‌బుక్ ద్వారా ఓ పక్క రైతు భరోసా పొందుతూ..మరో పక్క రైతు బీమాకు అర్హత పొందినట్లు తెలిసింది. అయి తే సదరు వ్యక్తి భూమిని అమ్మకం పెట్టకుండా కేవలం ప్రభుత్వ ఖజనాను కొల్లగొడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే తనకు లేని భూమితో పొందిన పాస్ బుక్కును అడ్డం పెట్టుకొని మరికొంత భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అలా పొందిన పాస్‌బుక్‌తో కుటుంబంలో మరొకరికి రైతు బంధు, రైతు బీమాను వర్తింపు చేసుకునే ఆలోచనలో ఉన్నట్లు సన్నిహితుల ద్వారా తెలిసింది.



**న్యాయం చేయండి**
**బాధితుడు, ఆరెంపుల బద్రిసాయి**

భూమిలేకున్నప్పటికీ అక్రమ పద్ధతిలో పాస్‌బుక్ పొందిన వ్యక్తి నుంచి అది తొలగించి అధికారులు నాకు న్యా యం చేయండి. అతను పొందిన బుక్ పేరుతో ఆ సర్వే నెంబర్‌లోని కొంత భూమిని ఆక్రమించాలని కుట్ర పన్నుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వేడుకుంటున్నాను.



**పరిశీలన చేస్తాను..**
**తహశీల్దార్, వినయేందర్‌రెడ్డి**

పరిస్థితి ఎమిటనేది తెలుసుకుని, పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తాను. దీనిపై జీపీఓ ద్వారా వివరాలను తెచ్చుకొని రికార్డులను తనిఖీ చేస్తాను.

## మౌన రోదన.. మూగబోయిన ఎర్రని చిరునామా..

**కాల గర్భంలో కలిసిపోతున్న ఉత్తరాల సాక్షి**




**ప్రజాపక్షం/కరకగూడెం:** టెక్నాలజీ ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చింది. క్షణాల్లో సందేశాలు సరిహద్దులు దాటుతున్నాయి. కానీ, ఈ వేగంలో మనం కొన్ని జ్ఞాపకాలను వెనక్కి నెట్టేశామా? ఒకప్పుడు ఊరి గుండె చప్పుడుగా నిలిచిన ఆ ఎర్రని పోస్ట్ బాక్స్.. నేడు ఒక చెట్టుకు కట్టబడి అనాథలా కనిపిస్తోంది. తన ఉనికిని చాటుకోవడానికి ఆరాటపడుతున్న ఆ పాత పోస్ట్ బాక్స్. ఇది కేవలం ఒక ఇనుప పెట్టె కాదు. వేల వేల భావోద్వేగాల ప్రవాహం. ఒకప్పుడు ఈ ఎర్రని పెట్టె కనిపిస్తే చాలు. ఏదో ఒక శుభవార్త వస్తుందని ప్రజల కళ్లు మెరిసేవి. దూరంగా ఉన్న కొడుకు క్షేమ సమాచారం కోసమో, సరిహద్దుల్లో ఉన్న సైనికుడి ప్రేమ లేఖ కోసమో ఈ పెట్టె ముందే పడిగాపులు కాచేవారు. కానీ ఇప్పుడు.. ఈ పెట్టె వైపు కన్నెత్తి చూసే నాథుడే లేడు. నేను ఇప్పుడు నిలబడి ఉన్న ఈ ప్రదేశంలో ఒకప్పుడు సందడి ఉండేది. ఈ పోస్ట్ బాక్స్‌లో ఉత్తరం వేయడం అంటే.. ఒక నమ్మకాన్ని భద్రపరచడం. ప్రజలు తమ ఆనందాలను, కన్నీళ్లను, ఆఖరికి తమ కలలను కూడా ఈ చిన్న పెట్టెలో వేసి పంపేవారు. కానీ స్మార్ట్ ఫోన్ల యుగం వచ్చాక, ఇన్స్టంట్ మెసేజ్ ల హడావిడిలో ఈ పోస్ట్ బాక్స్ కాల గర్భంలో కలిసిపోతోంది. దీనిపై ఉన్న ఉత్తరములు అనే పదం గతాన్ని గుర్తు చేస్తూ వెక్కిరిస్తున్నట్లుగా అనిపిస్తోంది. మార్పు సహజమే.. కానీ మార్పు అంటే పాత జ్ఞాపకాలను మర్చిపోవడం కాదు. సాంకేతికత పెరిగి మనకు సౌకర్యాలు పెరిగాయి కానీ, ఆ ఉత్తరం కోసం ఎదురుచూసే తపన, అది అందుకున్నప్పుడు కలిగే ఆ అనుభూతి ఇప్పుడు కనుమరుగయ్యాయి. ఒకప్పుడు గ్రామంలో అందరికీ ముఖ్యమైనది అనిపించిన ఈ వస్తువు నేడు ఒక అదనపు భారంగా మారి, ఇలా చెట్టుకు కట్టబడి మౌనంగా రోదిస్తోంది. ఈ దృశ్యం మనకు ఒక చేదు నిజాన్ని గుర్తు చేస్తోంది. అవసరం తీరిపోయాక వస్తువులైనా, విలువలైనా ఇలాగే మూలన పడతాయా? అన్న ప్రశ్నను మన ముందు ఉంచుతోంది. మరి ఈ మూగ రోదనను వినే తీరిక మన టెక్నాలజీ ప్రపంచానికి ఉందా? కాలం మారుతుంది.. సాంకేతికత పాత వాటిని తుడిచేస్తుంది. కానీ జ్ఞాపకాలు మాత్రం అలాగే ఉండిపోతాయి. ఈ పోస్ట్ బాక్స్ మనకు చెబుతున్నది ఒక్కటే. అభివృద్ధి వైపు పరుగెత్తడంలో తప్పు లేదు, కానీ మన మూలాలను, మన గత వైభవాన్ని ఇలా విస్మరించడం ఎంతవరకు సమంజసం?

**ఆ రోజులు గుర్తుకొస్తున్నాయి...!**
**- కొమరం సాంబయ్య, వయసు 50....**



ఆ రోజులే బాగుండేది. శనివారం లేదా ఆదివారం వస్తే సినిమా లేదంటే ఊరంతా ఒక్క చెట్టు కింద కూర్చొని ముచ్చట్లు పెట్టుకుంటూ సరదాగా గడిపిన రోజులే బాగుండేవి. వారానికి ఒక లెటర్ మన గ్రామానికి పోస్ట్ ఆఫీస్ సర్ వచ్చేవారు. అది చూసి చదువుకున్న వారి దగ్గరికి వెళ్లి దాంట్లో ఏముందో అని చదువుకున్న రోజులే బాగున్నాయి. ప్రతి రోజు దూరదర్శన్‌లో సాయంత్రం 8:00కి సాంగ్స్ వినుకుంటూ సరదాగా గడిపిన రోజులే బాగున్నాయి. ఇప్పటి ప్రపంచం అంత స్వార్థంతో ఉంది. ఫోన్లలో, కంప్యూటర్లలో పిల్లలు గాని, పెద్దలు గాని దాంట్లోనే టైంపాస్ చేస్తున్నారు. ఊర్లో, పల్లెలల్లో, పట్నాలలో ఏం జరుగుతున్న విషయాలు వెంటనే తెలుస్తున్నాయి. కానీ ఆ రోజుల్లో కుళ్ళు కుతంత్రాలు లేకుండా బతికిన పెద్ద వారి రోజులే చాలా బాగున్నాయి.

## ఘనంగా వీరహనుమాన్ విజయయాత్ర నిర్వహణ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** విశ్వ హింతూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయయాత్రను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడు సీతమ్మ వారి జాడ తెలుసుకొని తిరిగి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని జై శ్రీరాం నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. ఆధ్యాత్మిక ఉత్సాహంతో జరిగిన ఈకార్యక్రమం ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించింది. ఈకార్యక్రమంలో గౌరిశెట్టి శ్రీనివాస్‌రావు, బోడకుంట భిక్షం, బూరుగడ్డ వెంకటేష్, తెలగని శ్రీను, సంక కిరణ్, గుంతోజు నవీన్, తెలగాని సందీప్, తెలగాని రాము, కసనబోయిన నరేష్, మంత్రి కృష్ణర్జున్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివరామకృష్ణ అన్నారు. గురువారం చంద్రుగొండ గ్రామంలో రోడ్డు సేఫ్టీ క్యాంపియన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పని సరి అని అన్నారు. వాహనానికి అన్ని రకాల డాక్యుమెంట్లు ఉంటేనే రోడ్డుపై నడపటానికి అనుమతులు ఉంటాయన్నారు. యువత సైబర్ నేరాలకు దూరంగా ఉండాలన్నారు. నగదు యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. గంజాయి యువత అలవాటు కాకుండా దూరంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఎదుటి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈకారయ్క్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం చెక్కు అందజేత



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద మంజూరైన రెండు లక్షల రూపాయలు మొత్తాన్ని డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఖమ్మం బ్రాంచ్ జూలూరుపాడు లో వెంగన్న పాలెం గ్రామానికి చెందిన లబ్ధిదారిని డి. నాగమణి కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో బ్యాంక్ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మానుష మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, అసిస్టెంట్ మేనేజర్ శ్వేత, క్యాషియర్ తేజస్వి, నరేష్, నరేందర్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌ఎం, వార్డెన్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ అంకిత గొంది గూడెం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి హాస్టల్ నిర్వహణపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సదుపాయాలు, పరిశుభ్రత, భోజన నాణ్యత వంటి అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా హాస్టల్‌లో ఉన్న పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యత సరైన స్థాయిలో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా హాస్టల్ పరిసరాల పరిశుభ్రత లోపాలు, వసతి సదుపాయాల నిర్వహణలో నిర్లక్ష్యం గమనించిన కలెక్టర్, విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌కు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వెంటనే లోపాలను సరిదిద్దాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్లక్ష్యం చేసిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

## గ్రామ సభలతో సమస్యలకు పరిష్కారం

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండలంలోని 10గ్రామ పంచాయితీలలో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభలను సర్పంచుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ గ్రామ సభలో ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలు అయిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి (ఉచిత బస్సు), సబ్సిడీ గ్యాస్ రూ 500, గృహ జ్యోతి, సన్నరకం వరికి బోనస్, చేయుత పెన్షన్‌లు, కళ్యాణలక్ష్మి , ఇందిరా మహిళా శక్తి వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరెలు, కొత్త రేషన్ కార్డులు మొదలగుయ అంశాలపైన ప్రగతి నివేదికలు ఆయా శాఖల అధికారులు చదివి వినిపించారు. ఈ గ్రామ సభలలో మండల స్పెషల్ అధికారి అరుణ భారతి, మండలంలోని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీడీవో, ఎంపీఓ, వ్యవసాయ అధికారి, తహసీల్దార్, ఏఈ ఇరిగేషన్, ఏఈ పీఆర్, ఏఈ ట్రాన్స్కో, ఏఈ హౌసింగ్, ఎంఈఓ, ఏపీఓ, ఏపీఎం, ఆర్‌టీసీ అధికారులు, సెర్ప్ అధికారులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది, జిపిల పాలకవర్గం సభ్యులు, పెద్దలు, యువకులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

# పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** కనీసం నిలువు నీడ లేని కటిక పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. 99రోజుల ప్రణాళిక గ్రామ సభలలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 28,30,32వార్డులో గురువారం నిర్వహించిన గ్రామ సభలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఈ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేని వందలాది నిరుపేద కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఎంతో కాలంగా కిరాయి ఇండ్లల్లోనే జీవనం సాగిస్తున్న కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఈ సమస్యలపై సిపిఐ పార్టీ తరుపున పలు మార్లు ప్రభుత్వాలకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అవగాహణ ఉన్న నాయకుడిగా మంత్రి ఇళ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు విషయంపై సానుకూల నిర్ణయం తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం ఇళ్ల స్థలాలు, ఇండ్ల మంజూరు అంశంపై గ్రామసభల్లో ఏకగ్రీవ తీర్మానం చేయాలని సభలను ఆయన కోరారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, ఆయా వార్డుల మున్సిపాలిటీ నాయకులు, అధ్యక్ష,కార్యదర్శులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా శ్రేయస్సు కోసమే గ్రామ సభలు

**- ముష్టికుంట్ల గ్రామసభలో అదనపు కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/బోనకల్ :** ప్రజా శ్రేయస్సు కోసం 99రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న వివిధ పథకాలు, అమలు చేయబోయే వివిధ పథకాలను వివరించేందుకు గ్రామ సభ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి రూ.5లక్షలు బీమా కల్పించే దిశగా ప్రభుత్వం ఇందిరమ్మ బీమా పథకం ప్రవేశపెడుతుందన్నారు. నూతన రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు వడ్డీలేని బ్యాంకు లింకేజి రుణాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. వివిధ శాఖల ద్వారా గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై కూడా గ్రామసభలో చర్చ జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పేరిట ప్రభుత్వం 99రోజుల ప్రత్యేక కార్యాచరణ తీసుకుందని అన్నారు. వైద్యశాఖ, రోడ్డు భద్రత, మహిళా సంక్షేమం, యువజన క్రీడా శాఖ, తాగునీటి సరఫరా, వ్యవసాయం వంటి వివిధ శాఖల ద్వారా జూన్ 12 వరకు వివిధ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, మనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల దృష్టిలో ఉంచుకుని రాబోయే 5 సంవత్సరాల్లో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలో ప్రాధాన్యత ప్రకారం ఎంపిక చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని శాఖల్లోని ప్రగతి కార్యక్రమాలు ఆయా శాఖల అధికారులు పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామసభలో పంచాయతీ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధిపొందిన ప్రజల వివరాలు ప్రదర్శించి లబ్ధిదారు అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమాదేవి, తహశీల్దార్ రమాదేవి, ముష్టికుంట్ల గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్కే.సైదులు, ఎఇఓ త్రివేణి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో మెయిన్ డ్రైన్‌పై ఆక్రమణలు..!

**-గతంలో ఆక్రమణలు తొలగించిన కమీషనర్**
**-డ్రైన్ ఎలాంటి కట్టడాలు వద్దన్నా అప్పటి కలెక్టర్**
**-మరల రోడ్డుపైకి వ్యాపార ఆక్రమణలు**
**-ప్రమాదాలకు నిలయంగా పలు ప్రాంతాలు**







**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో మెయిన్ రోడ్లకు ఉన్న ఇరు వైపులా డ్రైనేజీలను మరల వ్యాపార సముదాయాల కోసం ఆక్రమణకు గురి చేసుకున్నారు. గతంలో అప్పటి కలెక్టర్ గౌతమ్ రోడ్ల ప్రక్కన డ్రైనేజీలు ఆక్రమించుకుంటే సహించవద్దని చెప్పిన ఆదేశాల ప్రకారం అప్పటి మున్సిపల్ కమీషనర్ వెంకటస్వామి మున్సిపల్ సిబ్బంది పోలీస్ సిబ్బందితో రోడ్ల ప్రక్కన డ్రైనేజీలు ఆక్రమించుకున్న కట్టడాలు, రేకులు కట్టిన వాటిని సైతం తీసివేయడం జరిగింది. అప్పటి మున్సిపాలిటీ పాలకవర్గం కూడా అధికారులకు సహకరించారు. మరల కొన్ని రోజుల తర్వాత యధామాములు అనే విధంగా ఆక్రమణలు కొనసాగు తున్నాయి. రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ దాటి ఎలాంటి వ్యాపార సముదాయాలకు సంబంధించిన వస్తువులు పెట్టవద్దని అప్పటి అదనపు కలెక్టర్ ఇప్పటి మహబూబాబాద్ కలెక్టర్ శ్రీజ ఆదేశాలను సైతం జారీ చేశారు. కాని వైరా మున్సిపాలిటీలో రోడ్లపైకి రేకులు వేసి ప్రజలకు ఇబ్బందిరకంగా వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. కొంతమంది డ్రైనేజీలు దాటి గదులను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. మున్సిపల్ శాఖ గతంలో నోటీసులు జార ఈచేసి కూడా ఆక్రమణలు తొలగించారు. మరల ఇప్పుడు ఆక్రమణలకు హద్దు ఆపు లేకుండా పోతుందని చెప్పవచ్చును. ఎందుకు అంటే రోడ్డుపైన నడిచి రావాలి అంటే వాహనాల నుంచి ఎలాంటి ప్రమాదం జరిగిందో తెలియని పరిస్థితి. కాని రోడ్డు దిగి ప్రక్కకు నడవలేని పరిస్థితి, వ్యాపార సముదాయాలు రోడ్లపైనే ప్రమాదకరంగా కనిపిస్తు న్నాయి. కొన్ని కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ ఇక్కడ ఉందా అనే విషయాన్నిసైతం మరిచిపోవాల్సిన పరిస్థితి కూడా ఉంది. పూర్తిగా డ్రైనేజీలు కనపడకుండా కట్టడాలను చేపట్టారు. రోడ్డు నిబంధనల ప్రకారం మున్సిపల్ నూతన చట్టాల ప్రకారం రహదారుల ప్రక్కన ఉన్న డ్రైనేజీలు నిర్మాణాన్ని దాటి ఎక్కడ ఎలాంటి కట్టడాలు కాని, వ్యాపార సముదాయ సామాగ్రి గాని పెట్టకూడదు. ఎందుకంటే మున్సిపాలిటీ పరిధిఓల ఏర్పాటు చేసిన డ్రైనేజీలను క్లీన్ చేసేవిధంగా చేయడానికి వీలు కలిగే విధంగా రోడ్డు కొలతల ప్రకారం డ్రైనేజీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకొని ఆక్రమణకు గురవుతున్న రోడ్ల ప్రక్కన డ్రైనేజీల ఆక్రమణలు తొలగించి పూర్తిగా డ్రైనేజీలు శుభ్రపరిచే విధంగా ఉండేవిధంగా షీల్డ్ తీయడానికి అనుకూలంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యం

**-డివిజన్ సభలలో మేయర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఖమ్మం నగరంలోని అన్ని డివిజన్లలో సభలు నిర్వహించారు. ఈ సభల్లో రాష్ట్ర గీతాలాపనతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశం వినిపించారు. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి, అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు సంబంధించి సభలో వివరించారు. పలు డివిజన్లలో జరిగిన సభల్లో మేయర్ పునుకొల్లు నీరజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంటి వద్దకే పాలన తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను రూపొందించి అమలు చేస్తుందన్నారు. 99 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వార్డు ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టి చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చిత్రపటానికి వైరా మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు దంపతుల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని , అధికారంలోకి తీసుకురావడానికి విశేష కృషి చేసిన మల్లు భట్టివిక్రమార్క ప్రజలందరికి ప్రతి ఇంటికి రూ.5లక్షలు భీమా సౌకర్యాన్ని కల్పించే విధంగా చట్టం చేసినందుకు 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ సీతారాములు ఆధ్వర్యంలో వార్డు ప్రజలు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముళ్ళపాటి విజయ సీతారాములు మాట్లాడుతూ పేద ప్రజలకు తెలంగాణ ప్రజలకు ఉపయోగపడే ఒక మంచి పథకం తీసుకొచ్చి పేద ప్రజల గుండెల్లో భట్టి విక్రమార్క నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వైరా మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వి.వెంకటరమణ



**ప్రజాపక్ష/వైరా:** వైరా మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్‌గా వాకదాని వెంకటరమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన వాకదాని వెంకటరమణ ఖమ్మంలో ఇప్పటివరకు విధులు నిర్వహించి వైరా మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన వరప్రసాద్ ఇటీవల అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరకడంతో ఆయనను జైలుకు పంపించారు. ఆయన స్థానంలో నూతనంగా వాకదాని వెంకటరమణను బదిలీపై వైరా పంపించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని దళారులను నమ్మవద్దని ఆయన సూచించారు. నేరుగా కార్యాలయానికి వచ్చి సంప్రదించి పనులు చేసుకోగలరని సూచించారు.

# ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు పథకాలు, సేవలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని, దళారీ వ్యవస్థను రూపుమాపి పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు రోజు, రోజుకు మరింత ప్రేమను పెంచుకుంటున్నారన్నారు సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్. పట్టణంలోని 23 వార్డుల్లో ప్రజా పాలన ప్రగతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 10, 11 వార్డుల్లో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాఘమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు, అధికారులు, ఏఈలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, పెన్షన్లు, ఉచిత గ్యాస్, చేయూత, గృహ జ్యోతి, కళ్యాణలక్ష్మి /షాదీ ముబారక్, రైతు బంధు వంటి పథకాల వివరాలు తెలియజేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు, వార్డ్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని డిఎల్‌పిఓ విజయలక్ష్మి సూచించారు. తల్లాడ మండలం మల్లారం గ్రామ పంచాయతీ నందు 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న కల్లూరు డివిజనల్ పంచాయతీ అధికారి జి.విజయలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో కావాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర నివేదికను తయారు చేసి పై అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లాడ ఎంపిడిఓ, ఎంపిఓ, సర్పంచ్, పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సుపరిపాలన కోసం 99 రోజుల కార్యాచరణ

**-ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలు**







**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టిందని జెడ్పి సిఈవో దీక్షారైనా తెలిపారు. గురువారం ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలో తొలుత రాష్ట్ర గీతాన్ని అలపించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని వినిపించి వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలు, లబ్దిదారుల వివరాలను తెలపడంతో పాటు కొత్తగా అమలు చేసే పథకాల గురించి వివరించారు. ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. రఘునాథపాలెంలో సర్పంచ్ గాజుల కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సభలో జెడ్పి సిఈవో దీక్షారైనా పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. సు పరిపాలనను అందించేందుకు 99 రోజుల కార్యాచరణ చేపట్టి గ్రామా ల్లో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో అశోక్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏడి కొంగర వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి , అనురాధ, ఉప సర్పంచ్ ప్రశాంత్, వార్డు సభ్యులు , పిఏసిఎస్ ఛైర్మన్ తాతా రఘురాం, అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు. వి. వెంకటాయపాలెంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సభలో వివిధ అంశాలపై చర్చించారు. సర్పంచ్ ఆది నారాయణ, ఎఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు లు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సిపిఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు సభలో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలిపారు. రైతు భరోసా నిధులు ఒక ఎకరానికే విడుదల చేశారని మిగిలిన మొత్తాన్ని కూడా విడుదల చేయాలన్నారు. కళ్యాణ లక్ష్మి పథకానికి సంబంధించి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వార్డు సభ్యులు సురేష్ గ్రామంలో విద్యుత్ స్తంభాల మార్పిడి, నూతన లైన్ల ఏర్పాటు గురించి సభలో వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిపివో విష్ణుచందన, ప్రత్యేకాధికారిణి అనితశ్రీ, ఎఈ ఎలక్ట్రికల్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఉప సర్పంచ్ ప్రవీణ్ కుమార్, పాలక వర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కిలారు వెంకటరమణ, జంగాల శ్రీను, పరిటాల ముత్తయ్య, ఆదాం, ఊయ్యూరు వెంకటనర్సయ్య, కిలారు రాజేశ్వరరావు, సత్యంబాబు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వేపకుంట్ల గ్రామ పంచాయతీలో సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.

# పాదయాత్రతో భద్రాచలం తరలిన భక్తులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కొంత మంది భక్తులు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోని రాములోరిని దర్శించుకునేందుకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నారాయణపురంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హిందుత్వ జెండాలను చేతపట్టుకుని పాదయాత్రగా బయలుదేరి తరలివెళ్లారు. సుమారు 8మంది పాదయాత్రగా రాముల వారి గేయాలను ఆలపిస్తూ తరలివెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు పండాలని స్వామి వారికి మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడిమళ్ళ కిషోర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, యరమల నాగార్జునరెడ్డి, సైదిరెడ్డి, కౌశిక్‌రెడ్డి ఇతర భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని గురువారం తల్లాడలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, గౌడ సంఘం జిల్లా నాయకులు రావుల గోపిగౌడ్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ తెలంగాణ ప్రాంతం కోసం నాడు రజాకార్లను ఎదిరించి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా ఉద్యమాలు చేశారని అన్నారు. ఆ మహానుభావుడిని స్ఫూర్తిగా తీసుకుని యువత బహుజనుల రాజ్యాధికారం కోసం ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం తల్లాడ మండల అధ్యక్షులు గుండ్ల నాగయ్య, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు సోషల్ మీడియా అధ్యక్షులు సమ్మెట రామకృష్ణ, గుండ్ల వెంకటేశ్వర్లు, సున్నం హరీష్, మొక్కా నవీన్, తిరుపతిరావు, సత్యనారాయణ, బొడ్డు రామ్‌లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం..ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..

**-వ్యాపార సముదాయాలకు నోటీసులు**
**-గాంధీ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తా**
**-మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ చంద్రకళ**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం, మన ఆరోగ్యాలను మనం కాపాడుకుందాం అని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. గురువారం వైరా మున్సిపాలిటీలో జరిగిన 6,12, 20 వార్డులతో పాటు పలు వార్డుల్లో జరిగిన వార్డు సభల్లో డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ పాల్గొన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలు కోసం దరఖాస్తు చేసుకోవాలని చంద్రకళ సూచించారు. ఈ సందర్భంగాచైర్‌పర్సన్ చంద్రకళ మాట్లాడుతూ 6వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తారని తెలిపారు. 12వ వార్డు, 20 వార్డు సభల్లో పాల్గొన్న చంద్రకళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొడదాం మనందరం ఆరోగ్యంగా ఉందాం. దానికి సంబంధించి మున్సిపాలిటీ నుండి వ్యాపార సముదాయాలకు ప్లాస్టిక్ నిషేధం కోసం నోటీసులు అందిస్తాం. పరిసరాల పరిశుభ్రతలో కూడా ప్రజలందరూ భాగస్వాములు కావాలి. డ్రైనేజీల్లో వ్యర్థ పదార్థాలు పడేయవద్దు, వ్యర్థాలు డ్రైనేజీల్లో పడేయడం వలన నీరు నిల్వ ఉండి దుర్వాసనతో పాటు విష జ్వరాలు వస్తాయని ఆమె అన్నారు. గాంధి చౌక్ ఏరియాలో పబ్లిక్ టాయిలెస్ గాంధి పార్క్ ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ సునీత చెప్పడం జరిగింది. దానికి కృషి చేస్తాము, గాంధి విగ్రహం వద్ద సుందరంగా పార్క్ తయారు చేసేందుకు త్వరలోనే ప్రతిపాదన తయారు చేస్తామని అన్నారు. గాంధిచౌక్ ఏరియాలో పబ్లిక్ టాయిలెస్ ఎక్కడో ఏర్పాటు చేయాలో ప్రజలు కూడా స్థలాన్ని ఎంపిక చేసే బాధ్యత తీసుకోవాలని అన్నారు. మున్సిపాలిటీలో ఒక ప్రత్యేకమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తామని క్లీన్ మున్సిపాలిటీగా ఉండేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. మున్సిపాలిటీలోని ప్రజలు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను తీసుకొచ్చి అభివృద్ధిలో ఉంచుతానని చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. 20వ వార్డులో మౌలిక వసతుల కోసం కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి సూచనలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గురులింగం, ఎస్సై పుప్పాల రామారావు, మున్సిపల్ అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోండి

**మున్సిపల్ వైస్ ఛైర్మన్ కట్ల సంతోష్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 9వ వార్డు సభ గురువారం వైరా వ్యవసాయ మార్కెట్ నందు మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వార్డు సభలో మున్సిపల్ కమీషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గేయాన్ని ఆలపించిన అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ప్రజల అభివృద్ధి, విద్యారంగం, వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ఇప్పటికే రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున రేషన్‌కార్డులు మంజూరి, సన్న బియ్యం, నాణ్యమైన విద్యతో పాటు మహిళా శక్తి పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు ఇందిరమ్మ ప్రభుత్వం అండగా ఉందని, మరోసారి ప్రజల వద్దకు ప్రజాపాలన తీసుకురావడం జరిగింది. ఈ వార్డు సభలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్ రాని వారు ఎవరైనా ఉంటే వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి రమేష్, మేదరమెట్ల పూర్ణయ్య, బొల్లేపల్లి శ్రీనివాసరావు, వీరపనేని చెన్నయ్య, వీరపనేని కృష్ణయ్య, పైడిపల్లి శ్రీనివాసరావు, బాటిలింగ్ చంద్రం, చెరుకూరి కిరణ్, పోలూరి సైదులు, రేచర్ల రామారావు, మున్సిపల్ శానిటైజర్ సూపర్‌వైజర్ నంద్రు నాగరాజు, ఆర్పి నాగమణి, వవిధ రాజకీయ పార్టీల నాయకులు రాజకీయాలకు అతీతంగా వార్డు సభలో పాల్గొన్నారు.

# 20వ వార్డు అభివృద్ధి కోసం కృషి



**ప్రజాపక్షం/వైరా:** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే తెలంగాణ ప్రభుత్వం వైరా మున్సిపాలిటీలో వార్డు సభలను ఏర్పాటు చేయడం జరిగిందని వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. గురువారం వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు అధ్యక్షతన జరిగిన వార్డు సభ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభకు పెద్ద ఎత్తున వారి ప్రజలు తరలివచ్చి వారి సమస్యలను వినతిపత్రాల రూపంలో అందించారు. డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ వార్డులో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఇందిరమ్మ పాలనలో అభివృద్ధి చేయమని ఆమె అన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్, కళ్యాణలక్ష్మి , ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. నిత్యం సమాజ సేవా కార్యక్రమాల్లో సేవలందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే యువకురాలు అయినా కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు దంపతుల ఆధ్వర్యంలో వార్డు అభివృద్ధిలో ముందుంటుందని ఆమె అన్నారు. నిత్యం వార్డు సమస్యల పట్ల కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి తన దృష్టికి తీసుకొస్తుందని వార్డులో ఎన్నో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పడం జరిగిందని, ప్రతి సమస్యను సిసి రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ వాళ్లతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు వాటిలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లక్ష్మి బాయి, వాకుండోత్ బీక్యా, గుగులోతు రాము, కృష్ణ, బాబు, షేక్ రహీం, ఖాజా, హుస్సేన్, వాంకుడోతు నాగేశ్వరరావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్థానిక 60వ డివిజన్ రామన్నపేటకు చెందిన బండారు శోభన్‌బాబు (38) ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురై మరణించాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో మూత్రశాలకు వెళ్లిన ఆయన అక్కడే గుండెపోటు రావడంతో మృతిచెందాడు. ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు పగలగొట్టి చూడగా నిర్జీవంగా పడి ఉన్న శోభన్‌బాబు ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# గ్రామసభలు విజయవంతం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణపై మండల పరిధిలోని 31 గ్రామపంచాయతీల్లో ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యోతన గురువారం గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించారు. గ్రామ సభల్లో కార్యక్రమం ప్రారంభంలో సర్పంచ్‌లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని చదివి విన్పించారు. అనంతరం ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. రైతు భరోసా లబ్దిదారుల జాబితా, 200యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలను గ్రామ కార్యదర్శులు చదివి విన్పించారు. త్వరలో అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై వివరించారు. ఆయా గ్రామపంచాయతీల ప్రజలు వృద్ధాప్య, వితంతువు, వికలాంగుల ఫెన్షన్లు, వేసవికాలం దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య పరిష్కారం కోసం దరఖాస్తులను అధికారులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్పెషలాఫీసర్ ఎడిఎ స్వర్ణ విజయచంద్ర, ఎంపిడిఓ సురేందర్, ఎంపిఓ గంధం శ్రీలక్ష్మి , వ్యవసాయాధికారి బోయినపల్లి సాయి, ఎంఇఓ మురళీమోహన్‌రావు, మండల వైద్యాధికారి ప్రశాంత్ వివిధశాఖల అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంత ఎస్సీలది ధర్మ పోరాటం

**రాజ్యాంగ హక్కుల అమలుకు ఎస్సీలు ఉద్యమించాలి**
**ఎస్సీ, ఎస్టీల ఐఖ్యతతోనే ఏజెన్సీ అభివృద్ధి**
**ఎంఎల్ఏ కూనంనేని**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఏజెన్సీ ప్రాంత ఎస్సీ లది ధర్మ పోరాటమని,దశాబ్దాల కాలంగా సాగుతున్న వివక్ష అంతం చేసేందుకు, రాజ్యాంగ హక్కుల అమలు కోసం ప్రతీ ఒక్కరూ ఉద్యమించాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం కొత్తగూడెం పట్టణంలోని షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ అనంతరం నిర్వహించిన ధర్మపోరాట సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏజెన్సీ ప్రాంతంలో నివశిస్తున్న ఎస్సీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు లభిస్తున్న ఫలాలు గానీ, వారి హక్కులకు గానీ ఎలాంటి భంగం కలిగించకుండా, ఇదే ప్రాంతంలో తరాలుగా జీవిస్తున్న ఎస్సీలకు న్యాయం జరగాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీలు, ఎస్టీలు తరతరాలుగా కలిసిమెలిసి ఉంటున్నారని, వారిమధ్య చిచ్చుపెట్టకుండా ఇరువురికి సమానమైన హక్కులు కల్పించేలా పాలకులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ సాకుతో ఎస్సీలకు కనీసం రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా చేయడం సరికాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వెసులుబాటు కల్పించాలన్నారు. అనాదిగా ఎస్సీల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలన్నారు. జనాభా ప్రాతిపదిక అన్ని రంగాల్లో 20 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాలీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని హితవు పలికారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. ఏజెన్సీ ఎస్సీలకు ఆత్మగౌరవం చాటేలా ఈ పోరాటాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సభలో మేయర్ మూడ్ గణేష్, జేఏసి నాయకులు బొమ్మెర శ్రీనివాస్, మద్దెల శివకుమార్, కూసపాటి కృపాకర్, జిల్లా నాయకులు మీసాల రాములు, కొంకటి కృష్ణ, చిలుముల గోపి కిరణ్, కర్లపూడి సుందర్ పాల్, సలిగంటి కొమరయ్య, ఎనగంటి శ్రీను, వేల్పుల భాస్కర్, ముచ్చా సుధాకర్, ఉండేటి దేవరాజు, కొప్పుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# అశ్వాపురం మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

**-అశ్వాపురం గ్రామసభలో సమస్యల వెల్లువ**
**-ప్రజలతో నేరుగా మమేకమైన కలెక్టర్ అంకిత్**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ అంకిత్ అశ్వాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న కలెక్టర్‌కు అశ్వాపురం సర్పంచ్ బానోత్ సదర్ లాల్ ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో గ్రామ పంచాయితీ అభివృద్ధి పనులు, ప్రస్తుత పరిస్థితులు, గ్రామంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సభకు భారీగా జనసందోహం తరలివచ్చి, ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్‌కు వివరించడం విశేషం. ఈసందర్భంగా గ్రామ ప్రజలు ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు సమస్య, పేదలకు గృహ నిర్మాణ సాయం ఆలస్యం, కంటి శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్య సహాయం, స్మశాన వాటిక అభివృద్ధి లోపాలు, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, బస్టాండ్ సౌకర్యం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు, మహిళలకు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం వంటి అనేక సమస్యలను ప్రస్తావించారు. అదే విధంగా గ్రామంలోని మౌళిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. పలువురు రాజకీయ నాయకులు కూడా గ్రామ సమస్యలను సమగ్రంగా వివరించి, పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విన్న కలెక్టర్ అంకిత్, ప్రతి అంశాన్ని గమనించి సంబంధిత అధికారులకు వెంటనే సూచనలు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికి సమయపాలనతో చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభలు ప్రజలకు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే వేదికలని, వాటి ద్వారా పారదర్శక పాలన సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమైన వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా పాలన మరింత ప్రజానుకూలంగా మారుతుందని ఆయన తెలిపారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్స, ఆసుపత్రిలోని మందుల కొరత లేకుండా చూడాలని ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ ముత్యాలరావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


# నకిలీ బంగారంతో ముగ్గురు

**-సైబర్‌కు సహకరించిన మరో ముగ్గురు అరెస్టు**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** నకిలీ బంగారంతో బ్యాంకును మోసం చేసిన కేసులో ముగ్గురిని సైబర్ నేరగాళ్లకు సహకరించారని మరో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులను కల్లూరు సబ్ డివిజన్ పరిధిలోని ఏన్కూరు, సత్తుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... సత్తుపల్లి కేంద్రంగా కోట్లాది రూపాయల విలువ కలిగిన సైబర్ నేరం చోటు చేసుకున్న సంగతి విధితమే. ఈ నేరంలో నేరస్తులకు సహకరించారన్న ఆరోపణతో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులను అరెస్టు చేసినట్లు ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన నేరాల కేసులో నిందితులైన ఉడతనేని వికాస్ చౌదరి, బొప్పన నాగప్రియ, సిఎస్‌పి బ్యాంక్ చంద్రుగొండ మేనేజర్ అఖిల్ అబ్దుల్‌కు సహకరించిన ముగ్గురిని అరెస్టు చేశారు. చంద్రుగొండ సిఎస్‌బి బ్యాంకు ఉద్యోగులైన బెండాలపాడుకు చెందిన ఓర్సు కృష్ణ, పెనుబల్లి మండలం బయ్యన్నగూడెంకు చెందిన బ్యాంకు ఉద్యోగి మందా శ్రీహరి బాబు, చంద్రుగొండ మండలం మద్దుకూరుకు చెందిన బ్రాంచ్ ఆపరేషన్ మేనేజర్ జుంజునూరి రాధాకృష్ణ ఉన్నారు. ముగ్గురు నిందితులను సత్తుపల్లి శ్రీహరి అరెస్టు చేశారని ఈ కేసులో మరి కొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు ఏసిపి తెలిపారు. ఏన్కూరు మండలంలోని నాగార్జున గ్రామీణ బ్యాంకులో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం పొందిన కేసులో ముగ్గురిని ఏన్కూరు పోలీసులు అరెస్టు చేశారు. ఏన్కూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం పొందిన కేసులో నలుగురిపై కేసు నమోదు కాగా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. బ్యాంకు మేనేజర్ కెవి ప్రశాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. శ్రీపాది సతీష్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బంగారాన్ని నిర్ధారించే అధికారిగా పని చేస్తున్నారు. శ్రీపాది మౌనిక, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజు నరేష్ లు 242 గ్రాముల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.9.53 లక్షల రుణాన్ని పొందారు. రుణం తిరిగి చెల్లించక పోవడంతో బ్యాంకు అధికారులు నిబంధనల ప్రకారం బంగారాన్ని వేలం వేసేందుకు సిద్ధమయ్యారు. వేలం సందర్బంగా పైన పేర్కొన్న వారు తాకట్టు పెట్టినవి నకిలీవని గుర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితులైన శ్రీపాది సతీష్, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజో నరేష్ లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రెండవ ముద్దాయిగా ఉన్న మౌనిక పరారీలో ఉన్నారు.



# పాఠశాల భవనాన్ని ప్రారంభించిన సబ్ కలెక్టర్



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి బంద్రుగొండ పంచాయితి కోయగట్టు గ్రామంలో 2025, 26 సంవత్సరంలో నూతనంగా మంజురైన ఎంపిపిఎస్ పాఠశాల భవనాన్ని సబ్ కలెక్టర్ సౌరభ్‌శర్మ గురువారం ప్రారంభించారు. పాఠశాలకు పూర్వ కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ గ్రామస్థులతో మట్టి ఇటుకలు తయారు చేయిామచి సుమారు మూడు లక్షలతో పంచాయితీరాజ్ శాఖచే భవనాన్ని నిర్మించారు. ఈ సంధర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో నూతన విద్యాలయం నిర్మించటం అభినందనీయమన్నారు. విద్యార్థులకు మెరగైన విద్యా భోదన అందించి వారి భవిష్యత్‌కు భరోసా కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. శ్రీరాంమూర్తి, ఎంపిడిఓ బొగ్గా నారాయణ, పంచాయితీరాజ్ ఏఈఈ శ్రీనివాస్, హౌజింగ్ ఏఈ హేమంత్, బంద్రుగొండ సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ వెంకటరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నునావత్ భిక్షం, టీచర్ రవి కుమార్, పంచాయితీ సెక్రటరీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇదేనా ప్రజాపాలన ...?

**- ఒక్కపనైనా చక్కగా చేశారా...? - అధికారులను నిలదీసిన కార్పొరేటర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరుతో 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు కావస్తున్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న మాదిరిగా ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. 23వ డివిజన్ ముస్తఫానగర్‌లో గురువారం జరిగిన సభలో 23వ డివిజన్ కార్పొరేటర్ మగ్బూల్ మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కనీసం డివిజన్‌లోని చిన్న చిన్న సమస్యలను పరిష్కరించలేకపోతుందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభలకు విచ్చేసిన అధికారులను ఆయన నిలదీశారు. ప్రజల సమస్యలను పరిష్కరించని పాలకులను ప్రజలు గద్దె దించే రోజు ఆసన్నమైందన్నారు. 23వ డివిజన్‌లో 72 గంటల్లో సమస్యలను పరిష్కరించని యెడల తమ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షేక్ లాల, ఇలియాజ్, పాషా, మహ్మద్ అలీ, ఝాన్సీ రాణి, మునాఫ్, ముజ్జు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల ఘటనలో స్థిర చరస్తుల అటాచ్‌మెంట్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భూదాన్ ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి పేదల వద్ద నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేశారన్న ఆరోపణలకు సంబంధించి అరెస్టయిన వారి ఆస్తులను పోలీసులు జప్తు చేశారు. స్థిర, చరస్తులు కలిపి రూ. 45లక్షలు విలువ చేసేవిగా ఉన్నాయని వాటిని అటాచ్‌మెంట్ కోసం చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే నిందితుల నుండి రూ.10.40 లక్షల విలువైన ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు సిపి సునీల్ దత్ తెలిపారు. ఖానాపురం హవేలీతో పాటు ఇతర పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి నిందితులుగా ఉన్న బల్లి శ్రీనివాస్, ముత్తయ్య, కె. వెంకన్న, తాళ్లూరి కృష్ణ, కె. కృష్ణయ్య, కె. రామచంద్రయ్య, లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం... రూ. 28838100 వసూలు చేసినట్లు అంగీకరించారని ఇందులో కొంత ర్యాలీలు, ఇతర పార్టీ అవసరాలకు ఉపయోగించగా మిగిలిన వాటితో సొంత ఆస్తులను కొనుగోలు చేసినట్లు సిపి తెలిపారు. తాళ్లూరి కృష్ణ వద్ద నుంచి ట్రాక్టర్, బానాల లక్ష్మణా చారి నుంచి హీరో డీలక్స్ మోటార్ సైకిల్, పాలెబోయిన ముత్తయ్య నుంచి రెండు టాటా ఏస్ వాహనాలు, కొప్పెర వెంకన్న నుంచి స్ప్లెండర్ మోటార్ సైకిల్, వీరయ్య వద్ద నుంచి రూ.4.48 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు తాళ్లూరి కృష్ణకు చెందిన 64.54 గజాల్లో ఉన్న రెండు అంతస్తుల ఇంటిని , కొప్పెర వెంకన్న నుంచి రూ. 10లక్షల విలువైన ఇండ్ల స్థలాన్ని అటాచ్‌మెంట్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు రూ. 10.40 లక్షల విలువ గల వాహనాలు, రూ.10లక్షల ఇంటి స్థలం, రూ. 19.9 లక్షల విలువైన ఇంటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటితో పాటు రూ. 448744 విలువైన నగదును స్వాధీనం చేసుకున్నామని సిపి తెలిపారు.

# కిడ్నాప్ కేసులో పది మంది అరెస్టు



**ప్రజాపక్షం/ ముదిగొండ :** మాజీ సర్పంచ్ ప్రస్తుత సర్పంచ్ భర్త పాము సెల్వరాజు కిడ్నాప్ కేసులో పది మందిని అరెస్టు చేసినట్లు ముదిగొండ సిఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం... కిడ్నాప్‌కు గురైన సెల్వరాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీస్ దర్యాప్తు చేపట్టడం జరిగిందని పండ్రేగుపల్లిలో షేక్ ఇబ్రహీం, షేక్ పకృద్దీన్ అన్నదమ్ముల మధ్య భూ వివాదం ఉందని ఆయన తెలిపారు. ప్రతి విషయంలోనూ తమకు అడ్డుగా వస్తున్నాడని భావించిన షేక్ పకృద్దీన్ అతని కుమారులు హైదరాబాద్ నుంచి కిరాయి వ్యక్తులను తీసుకు వచ్చి సెల్వరాజును గత నెల 25న కిడ్నాప్ చేశారు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు సెల్వరాజు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ముస్తఫా, షేక్ పకృద్దీన్, షేక్ ఖాసీం సాహెబ్, సయ్యద్ మహ్మద్, మహీర్‌బాన్ సింగ్, గుల్జీత్‌సింగ్, ఆజాద్ సింగ్, ఇస్మాయిల్, కోమల, వరికుప్పల తరుణ్ ను అరెస్టు చేసినట్లు మురళీ తెలిపారు.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిపాలన చేస్తా

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో వార్డు కౌన్సిలర్ దొంతబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వారి అవసరాలకు అనుగుణంగా దరఖాస్తులు చేసుకున్నారు. అనంతరం కౌన్సిలర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వార్డులోని ప్రజలు ఎవరైతే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్‌లు, కళ్యాణ లక్ష్మి రాని వారు ఉన్నారో వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాను కౌన్సిలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు గ్రామస్థులు పటాన్‌సాహిర్‌ఖాన్, కొల్లి శ్రీనివాసరావు, కంసాని బాబు, షేక్ నాగుల్‌మీరా, అమరబోయిన రమేష్, కోట సాయికుమార్, కంటెపూడి సైదబాబు, కంటిపూడి రాజా, దురిశెట్టి కృష్ణమూర్తి, మేకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.